క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నిరుద్యోగ యువకులకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో 15 రోజుల ఉచిత తాపి మేస్త్రీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని న్యాక్ సెంటర్ సామాజిక కార్యకర్త అజంత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. శిక్షణ సమయంలో రోజుకి రూ. 300 ఉపకార వేతనం, మధ్యాహ్నం భోజనం, యూనిఫాం, స్టేషనరీ డబ్బులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 94407 50954 సంప్రదించాలని కోరారు.

కోడి పిల్లల యూనిట్లు మంజూరు

తాంసి: మండలానికి 28 కోడి పిల్లల యూనిట్లు మంజూరైనట్లు మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. దేశీవాలీ కోళ్లతో పాటు గిరిరాజా, నాటుకోళ్ల కోడిపిల్లలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఒక యూనిట్‌లో 25 కోడి పిల్లలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు శుక్రవారం లోపు రూ.650 చొప్పున డీడీ చెల్లించి కోడి పిల్లల యూనిట్లను పొందాలన్నారు. వివరాలకు మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభం

కైలాస్‌నగర్: పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించనున్నారు. ఈమేరకు మున్సిపల్ సిబ్బంది గురువారం పనులు ప్రారంభించారు. విగ్రహాన్ని ఇది వరకు ఉన్న స్థలంలో కాకుండా ఫైర్ స్టేషన్‌కు ఎదురుగా గల డివైడర్ మధ్యలో ఏర్పాటు చేయనున్నారు. వైన్స్ ఎదుట ఉన్న స్థలంలో ఏర్పాటు చేస్తామని నిర్ణయించగా టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో డివైడర్ మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా బాజీరావు బాబా సప్తాహం


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బేల: మండలంలోని దోప్టాల గ్రామంలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ ఆలయం ప్రాంగణంలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. అనంతరం కాల దహిహండీ నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాకేశ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వైద్య కిషన్, రామెల్లి మోరేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

ఇంద్రవెల్లి: ఆదివాసీ అమరవీరుల స్థూపం వద్ద రూ. 5లక్షల నిధులతో షేడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. గురువారం జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఆదివాసీ నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి సర్పంచ్ కోరెంగా గాంధారి, తుడుందెబ్బ నాయకులు భీంరావ్, కోరెంగా సుంకట్‌రావ్, ఆర్క ఖమ్ము, తోడసం నాగోరావ్, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను, తుమ్రం జుగాదిరావ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తాంసి: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయానికి బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ రూ.25 వేల విరాళం అందజేశారు. సాయిబాబా ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, పార్టీ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, అశోక్ రెడ్డి, నర్సారెడ్డి, రాఘవేంద్ర, ఉమేష్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఒంటరి మహిళ రాధమ్మకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఇర్ల అభిలాష్ నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు. ప్రతీ నెల ఆమెకు అవసరమగు నిత్యావసర సరుకులు అందిస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన నాయకులు

బోథ్: బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామం నుంచి భట్టి విక్రమార్క చేపట్టిన పాద యాత్రకు వచ్చిన మాణిక్యం ఠాక్రేను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు గుడాల శేఖర్, బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారులకు వరం


చేపలను బయటకు తీసుకువస్తున్న మత్స్యకారులు


రొయ్య పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే (ఫైల్)


నీటితో కళకళలాడుతున్న మత్తడివాగు ప్రాజెక్టు

- మత్తడివాగు ప్రాజెక్టుపై ఆధారపడిన 200 కుటుంబాలు
- నిత్యం చేపలు పడుతూ.. ఉపాధి

తాంసి: మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టు వందలాది మంది మత్స్యకారులకు జీవనాధారంగా మారింది. మధ్యతరహా ప్రాజెక్టులో భాగంగా తాంసి, తలమడుగు మండలాల్లోని వాగుల నుంచి వచ్చే వరదనీరు వృథా పోకుండా వడ్డాడి సమీపంలో 2004లో శంకుస్థాపన చేసి, 2008లో పనులు పూర్తి చేశారు. సుమారు 250 ఎకరాల్లో ఉన్న మత్తడివాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 0.571 టీఎంసీలు. నిల్వ చేసిన వరదనీటి ద్వారా ఎనిమిది గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తోంది. ప్రాజెక్ట్‌లో చేప పిల్లలను పెంచుతూ.. మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు.

ఏటా ఉచితంగా..

గంగాపుత్రులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులతో పాటు, చెరువులలో వందశాతం రాయితీపై చేపపిల్లలను వదులుతున్నారు. మత్తడివాగు ప్రాజెక్టులో 5.84 లక్షల చేపపిల్లలు, రొయ్య పిల్లలను వదులుతున్నారు. చేపపిల్లలతో ప్రాజెక్టులో మత్స్యసంపద మరింత వృద్ధి చెందుతుంది. మత్స్యకారులు చేపల పెంపకాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అనంతరం పెరిగిన చేపలను వలలు వేసి పట్టి, మార్కెట్లో విక్రయిస్తున్నారు.

200పైగా కుటుంబాలకు ఉపాధి..

మత్తడివాగు ప్రాజెక్టులో చేపపిల్లలు వృద్ధి చెందడంతో ప్రాజెక్టు చుట్టూ ఉన్న పరిసర గ్రామాల మత్స్యకారులు చేపలు పడుతూ.. ఉపాధి పొందుతున్నారు. తాంసి, వడ్డాడి, ఉండం, సుంకిడి, హస్నాపూర్ గ్రామాలకు చెందిన 200 మంది మత్స్యకారులు మత్తడివాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతీరోజు ప్రాజెక్టులో వేసి, చేపలు పడుతున్నారు. చేపలు విక్రయించేందుకు ప్రాజెక్టు సమీపంలోని అంతరాష్ట్ర రహదారి వద్ద షెడ్డు నిర్మాణం చేపట్టితే మరింత సౌకర్యంగా ఉంటుందని మత్స్యకారులు కోరుతున్నారు.

8 గ్రామాలకు సాగునీరు..

మత్తడివాగు ప్రాజెక్టు ద్వారా మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 8 గ్రామాల రైతులకు సాగునీరు అందుతోంది. 13 కిలో మీటర్ల మేర పొడవున్న ఎడమ కాలువ ద్వారా 8,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. మండలంలోని జామిడి, వడ్డాడి, కప్పర్ల, బండల్‌నాగాపూర్, సావర్గాం, గోట్కూరి, జందాపూర్, పిప్పల్‌కోటి గ్రామాలకు చెందిన పంటచేన్ల గుండా కాలువ నిర్మాణం చేపట్టారు. దీనిపై ఆధారపడి రైతులు రెండు పంటలు పండిస్తున్నారు.

నిత్యం చేపలు పడుతున్నాం



మత్తడివాగు ప్రాజెక్టులో నిత్యం వలలు వేసి చేపలు పడుతున్నాం. ప్రాజెక్టులో చేప పిల్లలను ప్రతీ సంవత్సరం ప్రభుత్వం తరఫున వదలడం ద్వారా చేపల సంఖ్య పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం నీటి మట్టం తగ్గడంతో చేపలు భారీగా పడుతున్నాయి. రోజుకు రూ. 1000 వస్తున్నాయి.

– జింక రామన్న, మత్స్యకారుడు, తాంసి

షెడ్డు నిర్మాణం చేపట్టాలి



చేపలను ప్రాజెక్టు వద్ద విక్రయించేందుకు రాహదారిపై షెడ్డు నిర్మాణం చేపట్టాలి. షెడ్డు నిర్మిస్తే చేపలను విక్రయించడానికి సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో పట్టిన చేపలను రోడ్డుపై అమ్ముకోవాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– నారాయణ, మత్స్యకారుడు, వడ్డాడి

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ సుశీల్ బర్డ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించి ఈనెల 18న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా బీమాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: తపాలా శాఖ జీవిత బీమాను ఎంతో లాభదాయకమని తపాలా ఇన్‌స్పెక్టర్ సుజిత్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈనెల 15 నుంచి 24 వరకు తపాలా బీమా మేళా నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే గురువారం లక్కారం గ్రామ పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, సేవింగ్స్ ఖాతా, జీవిత బీమా గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం హరీశ్, ఎంవో రమేశ్, బీపీఎంలు నర్సింగ్‌రావు, జ్ఞానోబా, సాయి, సాజిద్, శ్రీజ, శ్రీనివాస్ రాథోడ్ పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఏమాయికుంట, దనోర (బి), దస్నాపూర్ గ్రామాలను సందర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు


చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గోవర్ధన్

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జైనథ్ మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.లక్ష విలువ గల నాలుగు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక నృత్యాలు, నాటిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వామి, ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ కట్కర్ల కవిత, బక్కన్న, మాడవార్ హరిష్‌రెడ్డి, సాయి, పోషకులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఉట్నూర్‌రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని ఏంద ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవానికి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు సంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, డీఈ భీంరావు, బీఏడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, మర్సుకోల తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు శ్రీధర్, ముకుంద్ రావు, మల్కు, తదితరులు పాల్గొన్నారు.

న్యాస్ పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుభాష్ గుప్తా

ఇచ్చోడ: జాతీయ అభ్యాసన సామర్థ్య నిర్వహణ పరీక్ష 2022– 23 (న్యాస్) కేంద్రాలను జాతీయ పరిశీలకులు సందర్శించారు. 3, 5వ తరగతుల విద్యార్థులకు గురువారం జిల్లా వ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఇచ్చోడ మండలంలో ఎంపీపీఎస్ ఇస్లాంనగర్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల బాలికలు, ఎక్సలెంట్ స్కూల్, ఎస్‌ఆర్ స్కూల్ కేంద్రాలను కేంద్ర పరిశీలకులు సుభాష్ గుప్తా పరిశీలించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి నారాయణ, ఎంఈవో ఉదయ్‌రావ్, తహసీల్దార్ మోహన్ సింగ్, ఎంపీడీవో రాంప్రసాద్, ఏవో కైలాస్, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు.

నార్నూర్: మండలంలో నిర్వహించిన న్యాస్ పరీక్షను తహసీల్దార్ ఆర్కా మోతీరాం, ఎంఈవో రాపల్లి ఆశన్నలు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గుంజాల ఎంపీపీ పాఠశాల, గంగాపూర్ సత్యశ్రీ పాఠశాల, నార్నూర్‌లోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలతో పాటు గాదిగూడ మండలంలోని శాటిలైట్ సెంటర్ చిత్తగూడలో పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు విలాస్ గౌడ్ తనవంతు సాయంగా స్టడీ మెటీరియల్, పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు హర్షవర్ధన్ రెడ్డి, కిష్టన్న, తదితరులు పాల్గొన్నారు.

20న ప్రజావేదిక

జైనథ్: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గజానన్‌రావ్ తెలిపారు. 2019 నుంచి 2022 వరకు మండలంలో చేపట్టిన ఈజీఎస్ పనుల ఆడిట్ నిర్వహించడం జరిగిందని, దీనిపై ప్రజావేదిక ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి

ఎదులాపురం: రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు లీక్ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ఇన్‌చారిజ మెస్రం భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో పారదర్శకత లోపించిందన్నారు. అధికార యంత్రాగం నిర్లక్ష్యం వల్లే పరీక్ష ప్రశ్నపత్రాల లీక్ అవుతున్నాయన్నారు. నిరుద్యోగులు రేయింబవళ్లు కష్టపడి చదువుతుంటే, ప్రశ్నపత్రాల లీక్‌తో ప్రభుత్వంపై నమ్మకం లేకుండా పోతుందన్నారు. ఈఘటనపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కరత్వాడలో గ్రామసభ


గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

బోథ్: మండలంలోని కరత్వాడ సర్పంచ్ దుర్వ సింధు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ పనులు, పారిశుధ్యం, అంగన్‌వాడీతో పాటు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నస్రీన్ సుల్తానా, బంక గంగయ్య, ద్యాగాల గంగారాణి, నల్లాల ఇందిర, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ప్రేమల, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


బహుమతులు అందజేస్తున్న సీడీపీవో వనజ

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆదిలాబాద్‌అర్బన్ సీడీపీవో వనజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ– 1 కేంద్రంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్ రాధ, ఆశ కార్యకర్త రాజూనా, మహిళలు పాల్గొన్నారు.

పగలే వెన్నెల



నేరడిగొండ: విద్యుత్‌ను ఆదా చేయాలంటూ అధికారులు ఓవైపు ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే.. నేరడిగొండలో మాత్రం రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. మండల కేంద్రంలోని బుద్దికొండ వెళ్లే రహదారిలో పగలే విద్యుత్ దీపాలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ ఆదాకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. తరగతి గదులు పూర్తయ్యేదెప్పుడో?



తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులు అసంపూర్తిగా ఉన్నాయి. గత కొన్నేళ్ల క్రితం పాఠశాలకు అదనపు గదుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించగా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: శ్రీకాంత్, ఎంఈవో, ఫోన్: 70135 48111

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు


నార్నూర్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నేరడిగొండ: ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 269 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 256 మంది హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నం తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని సీఎస్ ఉదయ్‌కుమార్, డీవో శ్రీలత తెలిపారు. ఏకలవ్య గురుకుల కళాశాల, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు గాదిగూడ మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు చెందిన మొత్తం 269 మంది విద్యార్థులకు 260 మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో రమేష్ రాథోడ్ గురువారం తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ఎంఎల్‌ఎస్ గోదాంను పరిశీలించారు. వెంట ఉప తహసీల్దార్ రాథోడ్ ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి


తనిఖీ చేస్తున్న అటవీ అధికారులు

నేరడిగొండ: దాబా హోటళ్లలో వినియోగించే కట్టెల కోసం అటవీశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎఫ్ఆర్‌వో గణేష్ అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న దాబా హోటళ్లలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హోటల్ యజమానులు పెర్మిట్ ఉన్న కట్టెలను మాత్రమే వినియోగించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.